క్లుప్తంగా

స్థానికేతరులను ఓడించండి

నల్లగొండ రూరల్ : అసెంబ్లీ ఎన్నికల్లో స్థానికేతర అభ్యర్థులను ఓడించి తన గ్యాస్ స్టౌవ్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని నల్లగొండ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి గోలి సైదులు అన్నారు. తనకు ఓటు వేయాలని అభ్యర్థిస్తూ సోమవారం నల్లగొండ పట్టణంలోని ఎన్‌జీ కాలేజీలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

కరాటే క్రీడాకారులకు మెడల్స్



మెడల్స్, సర్టిఫికెట్స్ అందుకుంటున్న క్రీడాకారులు

నల్లగొండ టూటౌన్ : హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో నిర్వహించిన 3వ జాతీయ స్థాయి కరాటే, కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్ పోటీల్లో నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన షావోలిన్ షోటోఖాన్ స్పోర్ట్స్ కరాటే ఇండియా క్రీడాకారులు మెడల్స్ సాధించారు. ముగ్గురు క్రీడాకారులు గోల్డ్‌మెడల్స్, సిల్వర్ మెడల్స్ సాధించారు. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు అంతర్జాతీయ రెఫ్రిస్ ఎస్.లక్ష్మి, బూడిద సైదులు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కరాటే ఇండియా ఫౌండర్ నాంపల్లి కనకారావు తదితరులు పాల్గొన్నారు.

'గొల్లకురుమల మద్దతు బీఆర్‌ఎస్‌కే'

మర్రిగూడ : గొల్లకురుమల మద్దతు కేసీఆర్ కే అని యాదవ సంఘం జిల్లా నాయకుడు గుండెబోయిన వెంకటేష్‌యాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జక్కలి విక్రమ్‌యాదవ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోటకూరి శంకర్‌యాదవ్, అచ్చిన బీరప్ప, కాస నరేష్, సంకబుడ్డి నర్సింహ, గిరి, ఏర్పుల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల సేకరణ

మర్రిగూడ : ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు అర్జీ పెట్టుకున్న వారికి ఎలక్షన్ కమిషన్ అవకాశం ఇచ్చింది. ఈ నేపథ్యంలో మర్రిగూడ మండలానికి చెందిన పది మంది నుంచి పోస్టల్ బ్యాలెట్ ఓట్లను సేకరించి ఎన్నికల అధికారి కార్యాలయంలో భద్రపరిచినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

నియోజకవర్గ అధ్యక్షుడిగా వెంకటేశ్‌గౌడ్



వెంకటేశ్‌ను సన్మానిస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్ : కాంగ్రెస్ వికలాంగుల విభాగం మిర్యాలగూడ నియోజకవర్గ అధ్యక్షుడిగా రాయినపాలెం గ్రామానికి చెందిన వెంకటేశ్‌గౌడ్‌ను నియమిస్తూ సోమవారం ఆ విభాగం రాష్ట్ర చైర్మన్ ముత్తినేని వీరయ్య ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు సంక్షేమ పథకాలను వికలాంగులకు వివరిస్తూ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. తన నియమకానికి అన్నీ విధాలుగా సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

చెన్నకేశవస్వామి ఆలయంలో విగ్రహాల చోరీ

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలం మామిడాల గ్రామంలో గల చెన్నకేశవస్వామి ఆలయంలో విగ్రహాలు చోరీకి గురయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం సాయంత్రం పూజలు పూర్తయ్యాక ఆలయ అర్చకుడు కారంపూడి స్తంభాచార్యులు గుడి మూసివేసి ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం గుడి తెరిచి చూసేసరికి ఆలయంలోని చెన్నకేశవస్వామి, శ్రీదేవి అమ్మవార్ల పంచలోహ విగ్రహాలు, రాధాకృష్ణుల చక్ర పెరుమాళ్ల ప్రతిమలు, శ్రీదేవి భూదేవి పుస్తెలు, వెండి కిరీటం చోరీకి గురైనట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్‌టీం సహాయంతో ఆలయం అంతా క్షుణ్ణంగా పరిశీలించి ఆధారాలు సేకరించారు. ఆలయ అర్చకుడి భార్య కారంపూడి మంగతాయారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ లింగయ్య తెలిపారు.



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం సభ్యులు

కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంట్ మూడు గంటలే



కొంపల్లి గ్రామంలో మాట్లాడుతున్న కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి



చీకటిమామిడిలో కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డికి స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు

- మునుగోడు నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి

మునుగోడు : కాంగ్రెస్ పార్టీకి పొరపాటున ఓట్లు వేసి గెలిపిస్తే గతంలో వలె రోజుకు మూడు గంటలు మాత్రమే కరెంట్ వస్తుందని మునుగోడు నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కోతులారం, చల్మెడ, కల్వకుంట్ల, కొంపల్లి, చీకటిమామిడి, జక్కలవారిగూడెం తదితర గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2018 ఎన్నికల్లో తనను గెలిపించకుండా పూటకో పార్టీ మారే నాయకుడిని గెలిపించడంతో మునుగోడు అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిందన్నారు. 2022 ఉప ఎన్నికలో తిరిగి తనను గెలిపించడంతో నియోజకవర్గవ్యాప్తంగా రూ.560 కోట్ల నిధులు మంజూరు చేయించి అనేక అభివృద్ధి పనులు చేపట్టానన్నారు. ఈ ఎన్నికల్లో కూడా తనను గెలిపిస్తే చర్లగూడెం, కిష్టరాయినిపల్లి రిజర్వాయిర్ పనులు పూర్తిచేసి సాగు నీరు అందిస్తానన్నారు. మునుగోడులో 30 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేస్తానని, మునుగోడును మున్సిపాలిటీగా మారుస్తానన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ఈ ఎన్నికల్లో గెలిచే అవకాశం లేదని గమనించి బీఆర్‌ఎస్ పార్టీలో గెలిచిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలను లక్షల రూపాయలు ఇచ్చి కొనుగోలు చేస్తున్నాడని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈసీకి ఫిర్యాదు చేసి రైతుల బ్యాంక్ ఖాతాల్లో రైతుబంధు వేయకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కర్నాటి స్వామి, సర్పంచ్‌లు జాజుల పారిజాతసత్యనారయణ, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బండా పురుషోత్తంరెడ్డి, మారగోని అంజయ్య గౌడ్, పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి, మాదరబోయిన పరమేష్, పగిళ్ల సతీష్, జోకూరి వేణుగోపాల్ రెడ్డి, ఐతగోని విజయ్, బోయపర్తి ప్రసాద్, ఏరుకొండ శ్రీను, నాగరాజు, యంపల్ల సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా కంపెనీ అనుమతులు రద్దు చేయిస్తా

చండూరు(గట్టుప్పల్) : బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గట్టుప్పల్ మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఫార్మా కంపెనీని రద్దు చేయించే బాధ్యత తనదేనని బీఆర్‌ఎస్ పార్టీ మునుగోడు నియోజకవర్గ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. సోమవారం గట్టుప్పల్ మండల పరిధిలోని వెల్మకన్నె గ్రామంలో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో కలెక్టర్ ద్వారా ఫార్మా కంపెనీకి నోటీసులు అందించినా, కోర్టు ద్వారా స్టే తెచ్చుకుని పనులు కొనసాగిస్తున్నారని అన్నారు. మరో అవకాశం ఇస్తే ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తానన్నారు.

ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇవ్వండి

- మునుగోడు నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న చలమల్ల కృష్ణారెడ్డి

చండూరు : మునుగోడు నియోజకవర్గంలో ఇప్పటి వరకు కాంగ్రెస్, సీపీఐ, బీఆర్‌ఎస్‌లకు అవకాశం ఇచ్చారు.. ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇచ్చి చూడండి అని బీజేపీ అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి ప్రజలను కోరారు. సోమవారం చండూరు మండలంలోని పలు గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ గత ఉప ఎన్నికలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గెలుపు కోసమే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మరికొందరు నేతలు తనకు కాకుండా స్రవంతి రెడ్డికి టికెట్ ఇప్పించారని ఆరోపించారు. రాజగోపాల్‌రెడ్డి తన స్వార్థం కోసం పార్టీ మారితే తాను ఊరూరా తిరిగి కాంగ్రెస్ పార్టీకి జీవం పోశానని అన్నారు. సీపీఐ పార్టీ కూడా తన విన్నపం మేరకు మునుగోడు టికెట్ అడగలేదని, కానీ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి దొంగచాటుగా కాంగ్రెస్ పార్టీలోకి వచ్చి టికెట్ పొందారని అన్నారు. అనంతరం చండూరు పట్టణంలోని 9వ వార్డుకు చెందిన పలువురు నాయకులు కృష్ణారెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. చెరుపల్లి కృష్ణ, చిట్టిప్రోలు నరసింహ, చిట్టిప్రోలు రాములు, గానుగు శ్రీరాములు, చెరుపల్లి నరేష్, చిలుకూరి సత్యనారాయణ, వర్కాల నరేందర్, ఆనందపు వీరయ్య, చెరుపల్లి రాజు, చెరుపల్లి వెంకటేశం బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోమటి వీరేశం, మండల అధ్యక్షుడు కాసాల జనార్దన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు నకిరేకంటి లింగస్వామి గౌడ్, ముదిగొండ అంజి, బీజేవైఎం నాయకులు పిన్నింటి నరేందర్ రెడ్డి, వంగూరి యాదయ్య, బొబ్బల మురళీమనోహర్‌రెడ్డి, వెంకట్ గౌడ్, నాగరాజు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

మర్రిగూడ : మండలంలోని పలు గ్రామాలకు చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు గ్యార గోపాల్, గ్యార యాదగిరి, పిట్టల శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి సమక్షంలో మర్రిగూడ మండల కేంద్రంలో సోమవారం బీజేపీలో చేరారు. కార్యక్రమంలో యాస అమరేందర్‌రెడ్డి, రాజేందర్‌నాయక్, పగిళ్ల లింగస్వామి, యాదగిరి, జిల్లా కిశోర్, లక్ష్మణ్, వెంకటయ్య, యాదయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి

మిర్యాలగూడ టౌన్ : సూర్యాపేట బీఎస్పీ అభ్యర్థి వట్టె జానయ్యపై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పోలీసు అధికారులను కోరారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూర్యాపేట నియోజకవర్గంలో బీసీ బిడ్డకు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే అగ్రకులాల దురహంకారంతో ఓడిపోతామనే భయంతో దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సూర్యాపేట నియోజకవర్గంలోని ఆత్మకూరు మండలం గట్టికల్లు గ్రామంలో ఆదివారం రాత్రి ప్రచారం నిర్వహిస్తుండగా బీఆర్‌ఎస్ నాయకులు వట్టె జానయ్య యాదవ్‌పై గొడ్డళ్లు, కత్తులతో దాడులను చేశారని ధ్వజమెత్తారు. దాడి చేసిన వారు ఎంతటి వారు అయినా వారిపై క్రిమినల్ కేసులను నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, సాయిరాం, నాగరాజు, సునిల్, రాంబాబు యాదవ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

చౌటుప్పల్ : మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఎండీ.సిరాజ్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. అదేవిధంగా కుంట్లగూడెం గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు వెల్గ సత్యనారాయణరెడ్డి, నర్సిరెడ్డి, నవీన్ రెడ్డి, బండమీది శేఖర్‌తో పాటు పలువురు సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి, మండల అధ్యక్షుడు గిర్కటి నిరంజన్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

కార్తీక మాసం పూజలు



పూజలో పాల్గొన్న భక్తులు

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి గ్రామంలోని శ్రీసోమేశ్వరస్వామి ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు వెల్లటూరి రాంమోహన్ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం నిర్వహించారు. కార్తీక మాసంలో భాగంగా మహిళలు తెల్లవారు ఝాము నుంచి ఆలయానికి వచ్చి దీపాలను వెలిగించి పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున ఉన్నారు.

మతోన్మాద బీజేపీని ఎన్నికల్లో ఓడించాలి

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు



గట్టుప్పల్‌లో మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు

చండూరు: మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రజల మధ్య చిచ్చురేపుతున్న బీజేపీని ఈ ఎన్నికల్లో ఓడించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు పిలుపునిచ్చారు. సోమవారం గట్టుప్పల్ మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఎం జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కమ్యూనిస్టులకు ఓట్లు లేవు.. గెలవరన్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఎర్రజెండా మెడలో వేసుకుని తిరగడం, మంత్రి హరీష్‌రావు సంగారెడ్డిలో సీపీఎం ఆఫీస్‌కు వెళ్లి ఓట్లు వేయమని అడగడం సిగ్గుమాలిన చర్య అన్నారు. ప్రజా సమస్యలపై నిత్యం పోరాడుతూ ప్రజల వెన్నంటే ఉంటున్న సీపీఎం మునుగోడు అభ్యర్థి దోనూరి నర్సిరెడ్డిని గెలిపించాలని కోరారు. కర్నాటి సుధాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్ట నరసింహ, సీపీఎం గట్టుప్పల మండల కార్యదర్శి కర్నాటి మల్లేశం, జిల్లా కమిటీ సభ్యులు చాపల మారయ్య, జెర్రిపోతుల ధనంజయగౌడ్, బొట్టు శివకుమార్, అచ్చిన శ్రీనివాస్, వల్గూరి శ్రీశైలం, కొత్తపల్లి నరసింహ, రాచమల్ల వెంకటరెడ్డి, కర్నాటి తుకారం, పసుపుల చెన్నయ్య, ఖమ్మం రాములు, ఖమ్మం రాములమ్మ, కర్నాటి జ్ఞానేశ్వరి, కర్నాటి ఉష తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సమగ్రాభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

- మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్



అభివాదం చేస్తున్న మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, అభ్యర్థి కడియం రామచంద్రయ్య

శాలిగౌరారం : తెలంగాణ సమగ్రాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని బీజేపీ రాష్ట్ర నాయకుడు, భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శాలిగౌరారం మండలంలోని చిత్తలూరు గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన ప్రచార ర్యాలీలో తుంగతుర్తి నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి కడియం రామచంద్రయ్యతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ అరవై ఏళ్ల పాలనలో అభివృద్ధిని పట్టించుకోని కాంగ్రెస్‌ను, అక్రమార్జనే లక్ష్యంగా తెలంగాణను దోచుకున్న బీఆర్‌ఎస్ పార్టీని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఒక్కటేనని.. ఈరెండు పార్టీలది కుటుంబ పాలన అన్నారు. దేశంలో ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం సమర్థవంత పాలనను అందిస్తోందన్నారు. ప్రజలు బీజేపీకి అవకాశమిస్తే డబుల్ ఇంజన్ సర్కార్‌తో సమగ్రాభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు జమ్ము రమేశ్, నాయకులు అల్లె రాములు, యాదగిరి, సయ్యద్, రాజు, వెంకటేశ్వర్లు, వినోద్, యాదగిరి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాజగోపాల్‌రెడ్డి సతీమణి లక్ష్మి ప్రచారం

మర్రిగూడ : మండలంలోని యరగండ్లపల్లి, తిరగండ్లపల్లి, తమ్మడపల్లి, అజ్జిలాపురం, కొండూరు గ్రామాల్లో సోమవారం మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సతీమణి లక్ష్మి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాజగోపాల్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాందాసు శ్రీనివాస్, మేతరి యాదయ్య, మెండు దీపికారెడ్డి, ఐతపాక జంగయ్య, కొట్టం మాధవిరమేష్, కల్లెం జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలతో ప్రతిఒక్కరికీ లబ్ధి

చిట్యాల: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీ స్కీంలతో ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరేలా ప్రణాళిక రూపొందించినట్లు నకిరేకల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వేముల వీరేశం తెలిపారు. చిట్యాల మండలంలోని ఎలికట్టె, పెద్దకాపర్తి గ్రామాల్లో ఆదివారం రాత్రి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన వెంకట్‌రెడ్డి, కాటం వెంకటేశం, డీసీసీ ఉపాధ్యక్షుడు కందిమళ్ల శివపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనర్సింహ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం అభ్యర్థి సుధాకర్‌రెడ్డిని గెలిపించాలి



మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

నల్లగొండ టౌన్ : కార్మికుల, రైతుల హక్కుల రక్షణకోసం పోరాడుతున్న సీపీఎం అభ్యర్థి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డిని నల్లగొండ ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం దొడ్డి కొమరయ్య భవన్ నుంచి పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎండీ సలీం, బాణాల పరిపూర్ణాచారి, దండెంపల్లి సత్తయ్య, నల్లా యాదయ్య, లొడంగి ఉపేందర్, అశోక్, భీమగాని గణేశ్, కత్తుల యాదయ్య, దండెంపల్లి సరోజ, పిన్నపురెడ్డి మధుసూదన్‌రెడ్డి, భూతం అరుణ, కాసర్ల గౌతంరెడ్డి, శ్రీరంగం, శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ నుంచి కాంగ్రెస్‌లోకి కోమటిరెడ్డి సాయితేజరెడ్డి



కోమటిరెడ్డి సాయితేజరెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ: నల్లగొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయి. బీఎస్పీ నల్లగొండ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసి విరమించుకున్న డాక్టర్ కోమటిరెడ్డి సాయి తేజరెడ్డి సోమవారం తన అనుచరులతో భారీ ర్యాలీగా నల్లగొండకు వచ్చి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అలాగే నల్లగొండ మండలం బుద్ధారం మాజీ సర్పంచ్ దేవరపల్లి అలివేలు వెంకట్‌రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చర్లపల్లి మల్లేష్, బీఆర్‌ఎస్ నాయకులు కృష్ణారెడ్డి, శీలం జానయ్య యాదవ్, భైరవుని నాగేంద్రగౌడ్, ఐతం హరియాదవ్, మెంబర్లు తోకల రేణుక జానయ్య యాదవ్, బకరం రమేష్, రజక సంఘం అధ్యక్షుడు చర్లపల్లి నరసింహ, బీఎస్పీ గ్రామ శాఖ అధ్యక్షుడు చర్లపల్లి నవీన్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బుర్రి శ్రీనివాస్, పోలె జయకుమార్, తుక్కాని వెంకటరెడ్డి, దున్న శివ, మధు, బొబ్బలి ప్రభాకర్‌రెడ్డి, యాడ్ల వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వస్తేనే పేదలకు న్యాయం

కనగల్ : కాంగ్రెస్ వస్తేనే నిరుపేదలకు సంక్షేమ పథకాలు అంది న్యాయం జరుగుతుందని నల్లగొండ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం కనగల్ మండల పరిధిలోని లచ్చుగూడెం, తిమ్మాజిగూడెం, తుర్కపల్లి, ఎం గౌరారం, అమ్మగూడెం, బొమ్మెపల్లి, కనగల్ గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మందడి రాంచంద్రరెడ్డి, మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, బాబురావు, గోలి జగాల్‌రెడ్డి, నల్లబోతు శ్రీను, పగిడిపాటి సత్తయ్య, గోగు యాదయ్య, గోన రవి, కన్నెబోయిన శివాజీ తదితరులున్నారు.

కోమటిరెడ్డి సబిత ప్రచారం

నల్లగొండ : నల్లగొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన సతీమణి సబిత, కూతురు శ్రీనిధి సోమవారం నల్లగొండ పట్టణంలోని పలు వార్డుల్లో ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. వారి వెంట కౌన్సిలర్లు కర్నాటి కరుణాకర్ రెడ్డి, బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు నాంపల్లి భాగ్య నరసింహ పాల్గొన్నారు.

కేసుల సత్వర పరిష్కారానికి కృషి



న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

మిర్యాలగూడ టౌన్ : కేసుల సత్వర పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని నూతనంగా బాధ్యతలను స్వీకరించిన మిర్యాలగూడ ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి, మండల న్యాయ సేవా సంస్థ అధ్యక్షుడు జి.వేణు అన్నారు. సోమవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వాగతోపాన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా నూతనంగా బాధ్యతలను స్వీకరించిన వేణుకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కుంభం శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి వాకిటి శ్రీనివాస్‌తో పాటు న్యాయవాదులు పుష్పగుచ్ఛం అందజేశారు. సీనియర్ సివిల్ జడ్జి బి.సుజయ్, జూనియర్ సివిల్ జడ్జి ఏ.స్వర్ణలత, అదనపు జూనియర్ సివిల్ జడ్జి బీఎస్ఎన్ సుమబాల, బార్ అసోసియేషన్ సభ్యులు పవన్‌కుమార్, మల్లేష్, కొంక వెంకన్న పాల్గొన్నారు.

రోడ్లపైనే ఇసుక ట్రాక్టర్ల పార్కింగ్



నల్లగొండ పట్టణంలోని సాగర్ రోడ్డు వద్ద రోడ్డుపైన నిలిపిన ఇసుక ట్రాక్టర్లు

నల్లగొండ క్రైం : నల్లగొండ పట్టణంలోని సాగర్ రోడ్డు వద్ద ఇసుక ట్రాక్టర్లను రోడ్డుపై నిలపడంతో ఇతర వాహనదారుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఆన్‌లైన్ ఇసుక బుక్ చేసిన వారి ఇంటి వద్దకు వెళ్లకుండా ఎక్కువ ధరకు అమ్ముకునేందుకు దళారులతో కలిసి బేరం కుదిరిన తర్వాత ఇసుక ట్రాక్టర్ డ్రైవర్లు అక్కడి నుంచి వెళ్తున్నారు. రోడ్లపైనే ఎక్కువ సమయం ఇసుక ట్రాక్టర్లను నిలుపుతుండడంతో ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లకు ఇబ్బందిగా మారింది. ఇసుక ట్రాక్టర్ల డ్రైవర్లు అకస్మాత్తుగా యూటర్న్ తీసుకుంటుండడంతోపాటు సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడుపుతున్నారు. ట్రాలీలు సక్రమంగా లేకపోవడంతో దారి పొడవునా ఇసుక కింద పడి వెనుక నుంచి వచ్చే వాహనదారుల కళ్లల్లో పడుతోంది. దీంతో వాహనాలు అదుపు తప్పి కిందపడుతున్నారు. ట్రాక్టర్లను రోడ్లపైన నిలుపుతున్నప్పటికీ పోలీస్‌లు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

మాలధారులకు అన్నదానం

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని శ్రీ సీతారామాంజనేయ చంద్రమౌళీశ్వర అయ్యప్ప స్వామి దేవాలయ సముదాయంలో సోమవారం దాత దేవాలయ అర్చకులు ఘంటసాల గాయత్రిశివప్రసాద్‌శర్మ, హర్షల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్తీకమాసం సోమవారం పురస్కరించుకొని అయ్యప్ప మాలాధారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాత దాత దంపతులను అయ్యప్పమాలాదారులు సన్మానించారు. అయ్యప్ప మాలాదారులు చిట్టడి ప్రభాకర్‌రెడ్డి గురుస్వామి, గణేశ్, కుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతులను ముంచుతున్న దళారులు!

- సాధారణ కాంటాలతోనే తూకం
- ఎలక్ట్రానిక్ కాంటాలు వినియోగించని వ్యాపారులు
- క్వింటాకు మూడు నుంచి ఐదు కేజీలు నష్టపోతున్న రైతులు



సోలిపురంలో సాధారణ కాంటాతో పత్తి తూకం వేస్తున్న వ్యాపారులు

మునుగోడు : ఆరుగాలం శ్రమించి పంటలు పండించిన రైతన్నలు దోపిడీకి గురవుతున్నారు. రైతులు దోపిడీకి గురికాకుండా దళారులకు క్లెంం వేసేందుకు అధికారులు నిబంధనలు విధిస్తున్నారు. కానీ అవి ఎక్కడా అమలు కావడం లేదు. ఇందుకు ప్రత్యేక నిదర్శనం సాధారణ కాంటాలతో దళారులు పత్తిని తూకం వేయడం. ప్రతి వ్యాపారి విధిగా ఎలక్ట్రానిక్ కాంటా వినియోగించాలని తూనికలు, కొలతల శాఖ అధికారులు సూచిస్తున్నపటికీ వాటిని ఏ ఒక్కరూ పాటించడం లేదు. దీంతో రైతులు దళారుల చేతుల్లో మోసపోక తప్పడం లేదు.

దళారులకు పత్తి అమ్ముతున్న రైతులు

రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అందించేందుకు సీసీఐ కేంద్రాలు ఏర్పాటుచేశారు. కానీ రైతులు ఆ కేంద్రాలకు వెళ్లి తమ పత్తిని అమ్ముకోలేక దళారులకు అమ్ముకుంటున్నారు. ఇదే అదనుగా భావించిన దళారులు గ్రామాల్లో రైతుల వద్ద పత్తిని కొనుగోలు చేసి స్థానిక మిల్లులకు విక్రయిస్తున్నారు. రైతుల వద్ద పత్తిని కొనుగోలు చేసే సమయంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎలక్ట్రానిక్ కాంటాలను వినియోగించాలి. కానీ వ్యాపారులు పాత పద్ధతిలో సాధారణ కాంటాలను వినియోగించి తూకం వేస్తున్నారు. దీంతో తూకంలో తేడాలు వస్తున్నాయని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

38 వేల ఎకరాల్లో పత్తి పంట సాగు..

మునుగోడు మండలంలోని 26 గ్రామాల్లో దాదాపు 20వేల మంది రైతులు ఈ ఏడాది సుమారు 38 వేల ఎకరాలకుపైగా పత్తి పంటను సాగుచేశారు. ఈ ఏడాది వర్షాలు సరిగా కురవకపోవడంతో ఎకరం ఐదు క్వింటాళ్లకు మించి ఏ రైతుకూ దిగుబడి రాలేదు. ఆ పంటను గ్రామాలకు వచ్చే దళారులకు విక్రయిస్తున్నారు. అలా పత్తి కొనుగోలు చేసే దాదాపు 20 మంది పాత పద్ధతిన సాధారణ కాంటాలను వినియోగిస్తున్నారు. దీంతో ప్రతి క్వింటాలుకు దాదాపు మూడు నుంచి ఐదు కేజీల వరకు తాము నష్టపోవాల్సి వస్తోందని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని ప్రతి వ్యాపారి రైతుల వద్ద కొనుగోలు చేసే పత్తి తూకం వేసేటప్పుడు విధిగా ఎలక్ట్రానిక్ కాంటా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పాత కాంటాలే వినియోగిస్తున్నారు.



ప్రతి వ్యాపారి గతంలో వలె పాత కాంటాలను వినియోగిస్తున్నారు. దీంతో తూకం వేసిన ప్రతిసారి దాదాపు మూడు నుంచి ఐదు కేజీల వరకు నష్టపోతున్నాం. అదే ఎలక్ట్రానిక్ కాంటాలు వినియోగిస్తే తూకంలో మోసం జరగదు. ఎలక్ట్రానిక్ కాంటాలు వాడే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– నెల్లికంటి రాఘవేంద్ర, రైతు, చల్మెడ